# The Word of Truth

# సత్యవాక్కు

క్రైస్తవ తెలుగు మాస పత్రిక

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P.O. Box 80, KAKINADA-533 001**

*Editor*
**J.C. CHOATE**

*Managing Editor*
**JOSHUA GOOTAM**

***Pleading for restoration of pure New Testament Christianity.***

సంచిక 1 **ఆగస్టు 1980** సంపుటి 1

## విషయ సూచిక

1. సంపాదకీయము
2. దేవుని తట్టు తిరుగుట
3. దేవుని బిడ్డలు ధూమ్రపానము చేయవచ్చునా ?
4. క్రీస్తుసంఘమును గూర్చి ఈ దిగువ సంగతులను ఆలోచించుము.
5. ఇది నమ్మతగినది.
6. దేవుని మార్గములు ఖచ్చితమైనవి.
7. ప్రశాంత జీవితము.
8. స్వస్థపర్చు కృపావరములు.

# సంపాదకీయము

## సత్యవాక్కు మాసపత్రిక — పరిచయము

'సత్యవాణి' రేడియో కార్యక్రమములు గత నాలుగు సంవత్సరముల నుండి రేడియో శ్రీలంకద్వారా ప్రసారము చేయబడుచున్న సంగతి మీరెరిగినదే. ప్రస్తుతము వారమునకు ఏడుసార్లు ఆ కార్యక్రమములు ప్రసారము చేయబడుచున్నవి. కాకినాడ వాస్తవ్యులు Bro. జాషువా గూటంగారు మొదటి నుండియు ఆ కార్యక్రమములలో ప్రసంగీకునిగా యున్నారు. ఆయన తెలుగు ప్రజల మధ్య సువార్తను వెదజల్లుటకు సల్పిన కృషి అంతటికిని ప్రస్తుతము ఆయన చేయుచున్న కృషి అంతటికిని మేము కృతజ్ఞులము.

రేడియోలో విన్పించబడిన ప్రసంగములు ముద్రింపబడి పుస్తకముల రూపమున తయారు చేయబడినవి. అవి ఇప్పటికి 19 సంపుటిలయినవి. అవి రేడియో శ్రోతలకు, బైబిలును చదువ నాసక్తి గలవారికి అందజేయ బడుచున్నవి. మేము మరికొన్ని పుస్తకములనుకూడ ప్రచురించుట మాత్రమే గాక వాటినికూడ రేడియో శ్రోతలకు అందజేయు చుంటిమి. మా ప్రసారములను వినిన వేలకొలది శ్రోతలకు బైబిలు కరస్పాండెన్సు కోర్సుకూడ అందజేయ బడుచున్నది.

రేడియో ప్రసారములవలన అనేక సంగతులు జరుగుచున్నవి. మొదటిగా, ఇప్పటికి సత్యవాణిని విని మూడు లక్షలమందికి పైగా మాకు ఉత్తరములు వ్రాసియున్నారు. వారిలో 3000 మందికి పైగా క్రీస్తు సువార్తకు లోబడియున్నారు. ఇంచుమించు 30 చోట్ల క్రీస్తు సంఘములు స్థాపించబడి యున్నవి. అయితే ఈపనిని మేము ముందుకూడ కొనసాగించ గలిగిన యెడల ఇది మనకు లభించు ఫలితముల ఆరంభము మాత్రమే. రేడియో ప్రసారములను, క్రైస్తవ సాహిత్య

ప్రచురణలను సమన్వయించుచు తద్వారా సత్ఫలితములను సాధించు నిమిత్తము ఈ మాసపత్రికను మేము ఆరంభించుచున్నాము. రేడియో కార్యక్రమములకు సహాయార్థముగా ఈ పత్రిక 'సత్యవాక్కు' యని పిలువబడును.

ఆంధ్రప్రదేశ్ లోని తెలుగువారికి మొట్ట మొదటిసారిగ ఈ మాసపత్రికద్వారా పవిత్ర క్రొత్త నిబంధన క్రైస్తవ్యము తెలుగులో అందజేయ బడు చున్నది. చదువరుల కందరికి ఆసక్తి జనకమైన వ్యాసము లను ప్రచురించుటకు మేము ప్రయత్నించెదము. సువార్త సేవాభి వృద్ధిని గూర్చిన వార్తలు ఇందులో సంతోషముతో మేము ప్రచు రించెదము. రేడియో కార్యక్రమములు, ముద్రింపబడిన పుస్తకములు ఇందు ప్రకటింపబడును. తెలుగు క్రైస్తవ సహోదరులు ఈ మాస పత్రికకు తమ వ్యాసములను పంపించెదరని మా విశ్వాసము.

దేవుని వాక్యములో నిర్దిష్టము చేయబడిన పవిత్ర క్రొత్త నిబంధన క్రైస్తవ్య వాణివలె 'సత్యవాక్కు' ప్రజ్వరిల్లునట్లు సంపాద కులు సర్వవిధముల ప్రయత్నించెదరు. మానవకల్పిత డినామినేషను లకు కాకుగాని బైబిలునందగుపడు సంఘమునకు మేము ప్రాతినిధ్య మిచ్చెదము. అన్ని విషయములలోను క్రీస్తు బోధనే బోధింతుముగాని మానవుల బోధనుకాదు. దేవుని ఆజ్ఞలను విశ్వసించి విధేయత చూపు వారందరిలోను ఐక్యతనే సాధించుటకు మేము అపేక్షించె దము గాని మత సంబంధముగా వారిని విభజించుటకు కాదు. బైబిలు ఎక్కడ మాట్లాడునో అక్కడ మేము మాట్లాడుదుము; బైబిలు ఎక్కడ మౌనియై యుండునో అక్కడ మేము మౌనులమై యుందుము. మరియు బైబిలు సంగతులను బైబిలు మార్గముననే చేయ ప్రయత్నింతుము. మతసంబంధ విషయములన్నిటిలోను, మాట లోను, చేతలోనుకూడ అందరు బైబిలు నొద్దకు మరలవలసినదని

నిత్యము మేము విజ్ఞాపన చేయుచుందుము. బైబిలు ఒక్కటి మాత్రమే క్రైస్తవులనుగా మాత్రము చేయునని మా విశ్వాసము.

మీరును మీవలె మా పాఠకులందరును మాతో కలసి దేవుని వాక్యమును పఠించి ధ్యానించెదరని, తద్వారా మనందరము పవిత్రమైన క్రీస్తు సువార్తకు విధేయులగుట ద్వారా ఏకము చేయబడుదుమని మా ప్రార్థనయై యున్నది. మనందరము ఒకే బైబిలును కలిగియుండి, ఒకే ప్రభువునందు విశ్వసించి, ఒకే ఆజ్ఞలకు విధేయులైన యెడల అప్పుడు మనము ఒకే విశ్వాసమును, సంఘమును, ఆరాధనను, కృషిని, నిరీక్షణను కలిగి ఏకమై యుండెదము. ఇదియే మా గమ్యము.

ఈ నూతన కృషిలో మీ సహాయము మా కెంతైనా అవసరమున్నది. దయచేసి ఈ పత్రికను చదివి ఇతరులకు అందజేయండి. ఈ పత్రిక ద్వారా మేలును పొందగల్గునట్టి వారి పేరు, చిరునామాలను మాకు పంపించండి. దీనిలో చందాదారులుగ చేరి ఈ పత్రిక ముద్రణలో మీరు సహాయపడవచ్చును. కనీసము పోస్టేజి ఖర్చులకైనను మీరు సహాయపడ గోర్తాము.

జె. సి. బెయిలీ, చార్లెస్ స్కాట్ మొదలగు విదేశీ సహోదరుల కృషినిబట్టియు, ఈ ప్రాంతములో యున్న అనేక బోధకులు, ఉపదేశకులు మరియు క్రైస్తవుల కృషినిబట్టియు ఆంధ్రప్రదేశ్ లో క్రీస్తు సంఘము అప్పుడే ప్రఖ్యాతి గాంచి యున్నది. ఈ సహోదరుల కృషికి తోడుగా రేడియో ప్రసారములను, పుస్తక ప్రచురణలను, ఈ మాస పత్రికను కలుపగా క్రీస్తు సువార్త మరింతకు ముందెన్నడు వ్యాప్తి జెందని రీతిగా ఈ దేశములో వ్యాప్తి జెందును. అందునిమిత్తమై మేము చేయు ప్రయత్నములను దేవుడు దీవించును గాక.

ఈ కొద్ది మాటలతో మిమ్మును 'సత్యవాక్కు' అను మాస పత్రికను పరిచయము చేయుచున్నాము. ప్రతినెల మిమ్మును దర్శించి

సత్యమున కీయబడవలసిన స్వరమును దానికి ఇచ్చుటకు నేము ఆశతో ఎదురు చూచుచుందుము. చివరిగా దేవుని వాక్యమును గూర్చి యేసు చెప్పిన మాటలను జ్ఞాపకము తెచ్చుకొందము: "సత్యమునందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము". మరియు "మీరు సత్యమును గ్రహించెదరు, అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 17:17; 8:32).

## జాషువా గూటం

ఆంధ్రప్రదేశ్ లోను, భారతదేశ మంతటనుకూడ జాషువా గూటంగారి పేరును వేలకొలది ప్రజలు బాగుగా ఎరిగియే యున్నారు. **Bro.** గూటంగారు చేయుచున్న రేడియో ప్రసారములను బట్టియు, వారు వ్రాయుచు ప్రచురించుచున్న పుస్తకములను బట్టియు, చేయుచున్న సువార్తికుని పనిని బట్టియు మరియు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌కు ఒసగుచున్న నాయకత్వమును, బోధనా పద్ధతులను బట్టియు ఆయన ప్రఖ్యాతి గాంచిన వారైరి. ఆయనకున్న తలాంతులు ఆసక్తి అర్హతలను బట్టి 'సత్యవాక్కు' మాసపత్రికకు ఆయనను మేనేజింగ్ ఎడిటర్ & పబ్లిషర్‌గా సహజముగా ఎంచుకొనుట జరిగినది. అందువలన నేను అత్యానందముతో ఈ ప్రకటనను చేయుచు ఈ మంచి పని విషయములో ఆయనను మీకు పరిచయము చేయుచున్నాను. ఈ హోదాలో ఆయనతో కలసి కృషి సల్పుటకు ఎదురుచూచుటయే గాక ఈ నూతన మాసపత్రికకు ఆయన నాయకత్వము వహించుటలో గొప్ప ఫలితములను ఆపేక్షించుచున్నాను.

—ఎడిటర్

# దేవుని తట్టు తిరుగుట

(*Returning to God*)

—పాల్ కేంట్రిల్

"మీ పితరుల నాటినుండి మీరు నా కట్టడలను గైకొనక వాటిని త్రోసివేసితిరి; అయితే మీరు నా తట్టు తిరిగిన యెడల నేను మీ తట్టు తిరుగుదునని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు" (మలాకీ ౩:7).

దేవుని చిత్తమును నెరవేర్చకుండగ ప్రజలు వెనుదిరిగినయెడల వారు పైకి భక్తిగల వారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించని వారై యుందురు (2 తిమో ౩:5). మతసంబంధ గుంపులు మందస్థితికి చేరుకొని క్షీణించుట జరుగును. వింతైన నూతన స్వరములు (సిద్ధాంతములు) వినబడుట ఆరంభమగును—అవి దైవమార్గమునుండి, దేవుని చిత్తమునుండి మరింత దూరముగ నడిపించును. దేవుని తట్టు తిరుగుట, ఆయన చిత్తము పునరుద్ధరించ బడుట అత్యవసరమై యున్నది.

## దేవుని తట్టు తిరుగుట తేలిక కాదు

దేవుని తట్టు తిరుగుట తేలిక కాదు. క్రీస్తే ప్రభువని బైబిలు ఒక్కటి మాత్రమే అమోఘమైన మార్గదర్శి యని తిరుగుట తేలిక కాదు. అట్లు తిరుగుటలో సత్యము కాని దానినంతటిని తొలగించి, విసర్జించి, వదలుకొనుట జరుగవలెను. మతశాఖల తత్వము నుండి, సంస్కర్తల నుండి, కౌన్సిలుల నుండి, పోపుల నుండి, బిషప్పుల నుండి దేవుని తట్టు తిరుగుట అందిమిడి యున్నది. వీరందరి నుండి దేవుడు ఆదిలో నెలకొల్పిన ప్రణాళికకు వెళ్ళుట అత్యవసరము. ఏలయనగా దేవుని తట్టు తిరుగుటలో ఆయన కట్టడలకు, సత్యమునకు, చిత్తమునకు తిరుగుట జరుగవలెను. మానవకల్పిత బోధలు, ఆజ్ఞలు, కట్టడలు తొలగించబడ

వలెను (మత్తయి 15.7-9). దేవుని వాక్యమునకు మన జీవితములలో సంపూర్ణాధిక్యత నీయవలెను (మత్తయి 7:21-23).

## ప్రత్యేక అవసరతలు

దేవునితో మనకు సంబంధముగల అన్ని విషయములలోను దేవుని తట్టు తిరుగుట అత్యవసరమై యున్నది. ఈ దిగువ అట్టి ప్రత్యేక సంగతులు కొన్ని పేర్కొన బడినవి:

1. వాక్యానుసారముగ క్రైస్తవు డగుటకు దేవుని తట్టు తిరుగవలెను: రక్షించబడుటకు దేవునికృప అవసరమని గ్రహించవలెను (ఎఫెసీ 2:8-9). ఏలయనగా మన పాపములను తీసివేసికొను శక్తి మనలో లేనేలేదు. దేవునియందును క్రీస్తునందును మనకున్న విశ్వాసము 'మారుమనస్సు నొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందునంతటి' బలమైనదై యుండవలెను (అపొ. కా. 2:38). క్రీస్తు మనలను రక్షించినందున ఆయన నామమును సంతోషముతో ధరించుకొని (అపొ. కా. 11:26), దేవుని నూతన సృష్టివలె (2 కొరింథీ 5:17), క్రీస్తుతో సంబంధ మేర్పరచు కొందుము (గలతీ 3:27).

2. క్రీస్తు యొక్క ఒకే శరీరములో సభ్యుడగుటకు: క్రీస్తు గాని ఆయన శరీరముగాని విభజింపబడలేదు. ఆయన సిలువ మరణము ద్వారా దానిని ఒక్కదానినిగా చేసెను (ఎఫెసీ 2:14-17). ఆయన సువార్తకు మనము లోబడుటద్వారా ఆయన తన సంఘముతో మనలను చేర్చును (అపొ. కా. 2:47). క్రీస్తు యొక్క 'ఒకే ఒక్క శరీర ముతో' తప్ప మరియే మతసంబంధ గుంపుతోను చేర్చబడి యుండు అవసరత మన కేమియును ఉండదు.

3. మన జీవితములలో క్రీస్తు నే నిజముగా ప్రభువని ప్రతిష్ఠించుటకు: ఆయన తన రాజ్యముపై రాజై యున్నాడు, సంఘమునకు

శిరస్సైయున్నాడు, బుద్ధిపూర్వకముగా విధేయులైయున్న తన సేవకులకు ఆయన యజమాని (లూకా 6:46; ఎఫెసీ 1:20-23; రోమా 6:16-18). తన ప్రజలపై ఆయన ఒక్కడు మాత్రమే శిరస్సైయున్నాడు. ఆఘనతను ఆయన ఇంకెవరితోను పంచుకొనుట లేదు. పొరపాట్లులేని తన వాక్యమువలన ఆయన తన సేవకులు, పౌరుల యొక్క జీవితములను పాలించుచు నడిపించును (యోహాను 12:48-50). మనము దేవుని తట్టు తిరుగవలెననిన మానవుల విశ్వాస ప్రమాణములు (creeds) అనుబంధములు (Disciplines), ప్రమాణములు (confessions) తొలగిపోవలసి యున్నవి. 'ప్రభువు ఈలాగు సెలవిచ్చుచున్నాడు' అను పరీక్షకు అన్ని సంగతులు గురి కావలసి యున్నవి. దేవుని సత్యముపై ఆధారపడి యుండని ఏసమాచారమునకైనను మేము మా హృదయములను చెవులను మళ్ళించుట దుర్లభము. సరిగదా దేవుని లక్షణమైన పరిశుద్ధత మన జీవితములో మరింత యెక్కువ కనబడును.

4. దేవుడు నడిపించు రీతిగా ఆయన ప్రజలతో కలసి ఆరాధించుటకు: 'మనము హృదయముతో పాడుదుము (ఎఫెసీ 5:19), నిష్కపటముగ ప్రార్థింతుము (1 కొరింథీ 14:15), ఆయన వాక్యమును శ్రద్ధతో చదువుదుము (ఎఫెసీ 2:6-8), ఆయన మరణమునకు జ్ఞాపకార్థముగా ప్రభువు బల్ల చుట్టు కూడుకొందుము (1 కొరింథీ 11:17-34; అపొ. కా. 20:7). మరియు మనము వర్ధిల్లిన కొలది కానుకలనిచ్చెదము (I కొరింథి 16:1-2; 2 కొరింథి 8:8). సమస్తమును సూక్ష్మముగను, క్రమబద్ధము గను, నిష్కపటముగను జరుగవలెను. ఆరాధనలోనికి తేబడిన సమస్తమార్పులను, కలగలుపులను, వినోద కార్యములను సంపూర్తిగ విసర్జించ వలెను.

## అసంపూర్ణముగా తిరుగుట పనికిరాదు

దేవుని తట్టు మనము అసంపూర్ణముగా కాదుగాని సంపూర్ణముగా ఆయన తట్టు మనము తిరుగవలెనని ఆయన కోరుచున్నాడు!! దేవుని తట్టు తిరుగవలెననెడి ఆశతో అనేకులు విడిపోయి 'స్వతంత్ర సంఘములను' ఏర్పాటు చేసికొనుచున్నారు. అయితే వారు సంపూర్తిగ దేవుని తట్టు తిరుగలేకపోయినందున ఘోర ప్రమాదమున్నది! మానవ కల్పిత బోధలను, ఆచారములను అనేకులు వారితో తీసికొని వచ్చుచున్నారు. దేవుని తట్టు సంపూర్తిగ తిరుగుటకు ఒకడు క్రొత్త నిబంధనలో బోధింపబడని సమస్తమును తొలగించి, విసర్జించి, వదలుకొనవలెను.

### ఒక సవాలు

ప్రియ చదువరీ, మొదటి శతాబ్దపు క్రైస్తవ్యమును పునరుద్ధరించుటకు అత్యంత కృషి సల్పుచున్న మీ ప్రాంతములో యున్న క్రీస్తు సంఘములను గూర్చి నీవు తెలిసికొనవలెనని మేము కోరుచున్నాము. దేవుని మూల పాఠములవైపు మానవులు సంపూర్తిగ తిరుగవలెనని అవి విజ్ఞాపన చేయుచున్నవి. మేము చెప్పిన సంగతులు యథార్థమని నీవు గ్రహించిన యెడల నీకు సమీపముగా యున్న క్రీస్తు సంఘమును వెంటనే నీవు దర్శించవలెనని కోరుచున్నాము.

---

## దేవుని బిడ్డలు ధూమపానము చేయవచ్చునా ?

**(*Can a Child of God smoke Cigarettes?*)**

— H.L. మీక్స్

సిగరెట్లు త్రాగుట నీ ఆరోగ్యమునకు హానికరమా? సిగరెట్లు తయారు చేయువారు 'సిగరెట్లు త్రాగుట వలన నీ ఆరోగ్యమునకు హాని కలుగును' అని ప్రజలకు చట్టప్రకారము హెచ్చరించవలసియున్నారు.

దీనిని, ఇట్టి మరికొన్ని హెచ్చరికలను మనము నిర్లక్ష్యపెట్టగలమా? ఆత్మహత్య పాపమా? పొగత్రాగుట ద్వారా నెమ్మదిగా ఆత్మహత్య చేసికొనుట పాపమా? మనలను మననే నాశనము చేసికొని చనిపోయిన తరువాత పరలోకమునకు వెళ్ళగలమా?

## నీ శరీరము

క్రైస్తవుని శరీరము పరిశుద్ధాత్మని ఆలయమై యున్నది (1 కొరింథి 6:19). మన శరీరముల ద్వారా దేవుని మనము మహిమ పరచవలెను (1 కొరింథి 6:20). పొగాకుకు అలవాటు పడి మనము దేవుని మహిమ పరచగలమా? అది శరీరమును మాలిన్య పరచునదియే గదా?

## నీ ప్రభావము

మన ప్రభువుయొక్క సంఘమే దేవుని మందిరము (1 తిమో 3:15). దేవుని ప్రజలే దేవుని మందిరమై యున్నారు. వారొక భౌతిక భవనము కాదు గాని వారు కూడుకొను స్థలము (గుడి) ఆరాధనతో ఒక ప్రత్యేక సంబంధమును కలిగియున్నది. మనము దేవుని ఆరాధించు ప్రదేశములో పొగత్రాగి లోకుల యెదుట సంఘమును అవమాన పరచెదమా? అనేక చోట్ల 'ఇచ్చట పొగత్రాగరాదు' అనే నోటీసులు మనకు కన్పించుచూ యుండును. మన ఆరాధన స్థలముల యొద్దకూడ అట్టి నోటీసులు అతికించుట అవుసరమా?

## నీ శ్వాసము

నశించి పోవుచున్న ఆత్మలకు సువార్తను బోధించుటకు క్రైస్త వుని స్వరమును క్రీస్తు వినియోగించగోరుచున్నాడు. మనము పుగాకుకు అలవాటుపడి మన శ్వాసమును (breath) కలుషితము చేయుదుమా? 'పొగతాగు సువార్తికుడు నాకేమి బోధించగలడు?' అని చుట్టలకు అలవాటు పడిన బోధకుని గూర్చి మనము తలంచుట సహజము.

## నీ బిడ్డలు

తలిదండ్రులు, ఇంటిలో యున్న పెద్దవారు లేక సంఘములో నాయకులుగా యున్నవారు పొగత్రాగుట కలవాటు పడిన వారైన యెడల వారి నుండి చిన్నపిల్లలు ఆ యలవాటును ఇట్టే అనుకరించెదరు. నడిపింపు కొరకు మనపై ఆధారపడియున్న వారి యెదుట అట్టి మాదిరిని మనము చూపించగలమా? నీవు పొగత్రాగుట వలన నిన్ను చూచి నేర్చుకొనిన పిల్లవాడెవడైనను భావిలో కేన్సరుతో గాని, గుండెజబ్బుతో గాని బాధపడవచ్చును.

## నీ మాదిరి

బహుశ సంఘములో సహోదరుడొకడు ఇక పొగత్రాగనని నిశ్చయించుకొని యుండవచ్చును. అతడా నిర్ణయముపై నిలకడగా యుండగల్గునట్లు నీవతని చుట్టూ పొగత్రాగకుండా యుండగలవా? అతడు మానివేయాలనుకుంటే మానివేయగలడు. గాని అతని సమక్షములో నీవే పొగత్రాగుచున్న యెడల అది అతనిని శోధించిన యట్లగును. "మాంసము తినుటగాని, ద్రాక్షారసము త్రాగుటగాని నీ సహోదరుని కడ్డము కలుగజేయునది మరేదియుగాని మానివేయుట మంచిది" యని అపో. పౌలు చెప్పెను (రోమా 14:21).

## నీ బాధ్యత

ఈ సంవత్సరములో లేక వచ్చే సంవత్సరములో లేక పది సంవత్సరములలో నీవు క్రీస్తుకొరకు ఎన్ని ఆత్మలను సంపాదించగలవు? "రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడును పనిచేయలేడు" అని యేసు చెప్పెను (యోహాను 9:4). సిగరెట్లు త్రాగుట ద్వారా నీ ఆయుశ్శు మితము చేసికొంటివి గనుక ఎన్ని ఆత్మలు నీవలన నిత్య నాశనమునకు వెళ్ళియుంటవి?

## నీ ధనము

సిగరెట్లు ఖరీదైనవి. రూపాయికి ఒక పేకెట్ చొప్పున రోజూ ఒక పేకెట్ సిగరెట్లు కాల్చువారికి సంవత్సరానికి 365/- రూపాయలు ఖర్చగును. డబ్బును అట్లు వృధాగా మనము ఖర్చుపెట్టగలమా? యేసు అయిదువేలమందికి అద్భుతరీతిగ ఆహారము పెట్టినను 'ఏమియు నష్టపడకుండ మిగిలిన ముక్కలు పోగుచేయుడని తన శిష్యులతో చెప్పెను' (యోహాను 6:21). సిగరెట్లు ఖరీదు మాత్రమే కాకుండా సిగరెట్లు త్రాగువారి అజాగ్రత్త వలన వందలకొలది, లేక వేలకొలది అగ్ని ప్రమాదములు ఎన్ని జరుగుటలేదు? లక్షల కొలది ఆస్థి ఎంత నష్టము అగుటలేదు? ఆ ధనము నంతటిని అట్లు మనము వృధా చేయ గలమా?

## నీ ఆత్మ

ఈ వ్యాసమును చదువుచున్నవారికి ఒకమాట: నీవు క్రీస్తు సంఘసభ్యుడ వయినను కాకపోయినను, నీవు పొగ త్రాగువాడవయినను కాకపోయినను, నీకు కేన్సరుగాని గుండెజబ్బుగాని ఉన్నను లేకపోయి నను మనందరము అనుకొన్న దానికంటె ముందుగానే మరణించు వారము. గనుక మరణమునకు, తీర్పునకు మనము ఇప్పుడే సిద్ధపడ వలెను. ఎట్లు సిద్ధపడవలెనో బైబిలు మనకు బోధించుచున్నది:

### పరలోకమునకు మార్గము

విశ్వాసము: యోహాను 8:24; హెబ్రీ 11:6
మారుమనస్సు: లూకా 13:3; అపొ. కా. 17:30
ఒప్పుకోలు: మత్త 10:32; అపొ. కా. 8:37
బాప్తిస్మము: మార్కు 16:16; రోమా 6:3

బాప్తిస్మముద్వారా క్రీస్తు మరణములోనికి మనము పాతిపెట్టబడి నూతన జీవితము జీవించుటకు తిరిగి లేపబడినందున (రోమా 6:3, 4),

క్రీస్తునందున్న ఈ నూతన జీవితమును అంతమువరకు జీవించెదముగాక. ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు (గలతీ 3:27), ప్రభువు అతనిని తన సంఘములో చేర్చును (అపో. కా. 2:47). ఆయన బండ మీద నిర్మించిన సరియైన సంఘమది (మత్తయి 16:18). అది ఒక డినామినేషన్ కాదు. ప్రభువే శిరస్సైయున్న సంఘములో యుంటూ (కొలస్స 1:18), మరణ పర్యంతము నమ్మకముగా యుండుము (ప్రక. 2 : 10). ఆయన నిత్యజీవకిరీటాన్ని నీకు బహూకరించును. నీవట్లు చేయగలవా? ఇది చాల అత్యవసరము. ఇప్పుడే నీవట్లు చేయగలవా? ఇదిగో, ఈరోజే రక్షణదినము (2 కొరింథీ 6:2).

---

## క్రీస్తు సంఘమును గూర్చి ఈ దిగువ సంగతులను ఆలోచించుము

—తామస్ క్లెమన్స్

"మెట్టుకు సహోదరులారా, యే యోగ్యతయైనను, మెప్పయినను ఉండిన యెడల ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో వాటిమీద ధ్యానముంచుకొనుడి" (ఫిలిప్పీ 4:8).

1. క్రీస్తు సంఘము క్రీస్తు శరీరమై యున్నది: "మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22, 23).

2. క్రీస్తు సంఘము క్రీస్తుచే స్థాపించబడెను: "మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక

ద్వారములు దాని యెదుట నిలువ నేరవని నేను నీతో చెప్పుచున్నాను" (మత్తయి 16:18).

3. క్రీస్తు సంఘమును క్రీస్తు తన స్వరక్తమిచ్చి కొనెను : "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (అపొ.కా. 20:28).

4. క్రీస్తు సంఘము దేవునిచే ఏర్పాటు చేయబడెను : "అంత్య దినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వతశిఖరమున స్థిరపరచబడి కొండలకంటె ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్టు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు. ఆ కాలమున సీయోనులో నుండి ధర్మశాస్త్రము, యెరూషలేమునుండి యెహోవా వాక్కు బయలు వెళ్ళును" (యెషయా 2:2, 3).

5. క్రీస్తుసంఘమునకు క్రీస్తు ఒక్కడే శిరస్సయియున్నాడు : "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన ఆదియై యుండి మృతులలో నుండి ఆది సంభూతుడాయెను" (కొలస్స 1:18).

6. దేవుడు ఆజ్ఞాపించిన రీతిగా క్రీస్తు సంఘము ఆరాధించును : "ఒకని నొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువునుగూర్చి పాడుచు కీర్తించుడి" (ఎఫెసీ 5:19).

A) ప్రార్థన : "వీరు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" (అపొ.కా. 2:42).

B) కలసి ఆదివారమున రొట్టె విరుచుట : "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్ళనైయుండి,

వారితో ప్రసంగించుచు అర్ధరాత్రివరకు విస్తరించి మాటలాడుచుండెను" (అపో. కా. 20:7).

C) కానుకలిచ్చుట: "నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లినకొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" (1 కొరింథీ 16:2).

D) బోధించుట: "వారు విశ్వసించనివానికి ఎట్లు ప్రార్థన చేయుదురు? వినని వానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువారు లేకుండ వారెట్లు విందురు?" (రోమా 10:14).

E) చదువుట: "నేను వచ్చువరకు చదువుట యందును, హెచ్చరించుట యందును, బోధించుట యందును జాగ్రత్తగా యుండుము" (1 తిమోతి 4:13).

7. క్రీస్తు సంఘమందు ప్రవేశించు విధాన మేదనగా:

క్రీస్తునందును ఆయన సువార్త యందును విశ్వాసముంచవలెను: "కాగా మీ పాపములోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయనననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని" యేసు చెప్పెను (యోహాను 8 : 24).

నీ గత పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను: "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు ఆలాగే నశింతురు" (లూకా 13:5).

నీ విశ్వాసము దేవుని యెదుటను, మానవుల యెదుటను ఒప్పుకొనవలెను: "ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:10).

నీ పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి ఆయన శరీరమగు

సంఘములోనికి బాప్తిస్మము పొందుము. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" (గలతీ 3:27).

8. క్రీస్తు సంఘము ఘనతకు గవినియై యున్నది: "ఇది దేవుని మందిరమేగాని వేరొకటికాదు; పరలోకపుగవిని యిదే" (ఆది 28:17). "క్రీస్తు సంఘము లన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" (రోమా 16:16).

మిత్రుడా, నీవు ఇంతవరకు ఈ వ్యాసమును చదివినందుకు మేము సంతోషించుచున్నాము. ఈ సంగతులను గూర్చి నీవు నిష్కపటము గను ప్రార్థన పూర్వకముగను ఆలోచించెదవని మా విశ్వాసము. మరీ ముఖ్యముగా నీవు ఆలసించక క్రీస్తు సువార్తకు లోబడుదువనియే మా నిరీక్షణ.

ఈ వ్యాసములో లేఖనములనుండి చూపించబడిన ఋజువులను బట్టి క్రీస్తు సంఘము తన నామములోను, పాలన పద్ధతిలోను, ఆరాధన లోను, బోధలోను బైబిలు ననుసరించుచున్నదని గ్రహించుకొనగలవు. బైబిలులో కనిపించని ఒక మత సంబంధమైన గుంపులో నీవు చేరవలసి నదని మేము ప్రజలను కోరుటలేదు. మానవులందరు క్రీస్తునే వెంబ డించి క్రొత్త నిబంధన సంఘస్థులు కావలెనని మాత్రమే మా ఆశయై యున్నది.

ఈ సంగతులను నీవు తీవ్రముగ ఆలోచించ మనవి!

# ఇది నమ్మతగినది

బైబిలు అను పదమునకు గ్రంథము అని అర్థము. అది నాలుగు వేల సంవత్సరములకంటె పాతది. బైబిలుకు సాటియైన గ్రంథము ఈ ప్రపంచమందు లేదు. ఉండబోదు కూడ! అది కాలపరీక్షల నన్నిటి యందును దృఢముగ నిలిచియున్నది. బైబిలును, దాని బోధలను ఎరిగినవారు దానియందు బహుగా విశ్వాస ముంచెదరు. మరి యే గ్రంథము కూడ జవాబు చెప్పలేనట్టి కొన్ని మానవ సమస్యలకు బైబిలు జవాబిచ్చుచున్నది. మానవుని ఆది అంతములను అది అతనికెరుక పరచుచున్నది. అంతేకాదు—అతడు తన జీవితకాలమంతయు దేవునియెడల నమ్మకముగా నున్నయెడల అతడు చనిపోయినను తిరిగి బ్రతుకునని అది బోధించుచున్నది. బైబిలును సమ్మతించువారు, దానిని దేవుని వాక్యమని నమ్ముదురు. విశ్వాసము వలన బైబిలు దేవుని వాక్యమై యున్నదని చెప్పవచ్చును. ఏల యనగా విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటి యొక్క నిజస్వరూపమును అదృశ్యమైనవి యున్నవనుటకు ఋజువునై యున్నది. గనుక ఆ విశ్వాసము గ్రుడ్డిది కాదుగాని, అది అనేక పునాదులపై ఆధారపడి యున్నది.

బైబిలు 66 పుస్తకముల సంపుటియై యున్నది. దానిని 40 మంది 1600 సంవత్సరముల కాలములో వ్రాసిరి. ఒకడు మరియొకడు వ్రాసినదానినిగాని, లేక వ్రాయబోవుదానినిగాని ఎరిగి యుండలేదు. వారిలో కొందరు గొర్రెలకాపరులు, కొందరు జాలరులు, ఒకడు వైద్యుడు, మరియొకడు ద్వేషింపబడిన సుంకరి. వారు వివిధకోణముల ద్వారా అనేక అంశములను గూర్చి వ్రాసిరి. అయినను వారి వ్రాతలను మనము ఏకీభవించి చూచిన, వారు ఒకే ప్రాముఖ్యాంశమును గూర్చి, అనగా మానవరక్షణను గూర్చి వ్రాసినట్లు తెలిసికొనగలము.

అందేవిధమైన స్వవిరుద్ధ సంగతులు లేక బ్రహ్మాండమైన ఏకీభావము కలదు. బైబిలు లేఖకులు వివిధకాలములలో జీవించినను, వారిని నడిపించిన "ఆత్మ" మాత్రము మార్పు లేనిదై యున్న దనుట నమ్మ తగినది. అది దేవుని ఆత్మయే! వివిధ కాలములలో జీవించిన 40 మంది పురుషులు, దైవావేశము లేకయే అట్టి బ్రహ్మాండమైన ఏకీభావముగల గ్రంథమును తయారుచేయుట అసాధ్యము.

విజ్ఞానశాస్త్ర ప్రకారము బైబిలు యథార్థమైనది. 18వ శతాబ్దపు అంతమందు హెర్బర్ట్ స్పెన్సర్ అను నతడు–"మానవ జ్ఞానమునకు అందనట్టి అయిదు స్పష్ట సంగతులున్నవి. అవేవన: "కాలము, శక్తి, క్రియ, రోదసీ లేక మహాకాశము, పదార్థము అనునవి" యని లోకమునకు ప్రకటించెను. ఇది గొప్ప శాస్త్రీయ సిద్ధాంతమువలె పొగడబడెను. అయితే ఇదిగో! మనము బైబిలును చూచిన–అందలి మొదటి వచనమే ఈ అయిదు శాస్త్రీయ సూత్రములతో నిండి యున్నది. అది ఇట్లు నుడువుచున్నది–"ఆదియందు (కాలము) దేవుడు (శక్తి) భూమిని (పదార్థము), ఆకాశమును (రోదసీ) సృజించెను (క్రియ)". దేవుని వాక్య లేఖకుడగు మోషే ఈ అయిదు స్పష్ట సంగతులను ఎరిగియుండెనా? లేక అతడు దేవునిచే నడిపింపబడెనా? దీనిని ఏమని చెప్పుదుము?

అనేక సంవత్సరముల తరబడి భూమి బల్లపరుపుగా నుండెనని ప్రజలు భావించిరి. 15వ శతాబ్దములో కొలంబస్ అను నతడు భూమి గుండ్రముగా నున్నదని చెప్పగా, అతడు హేళన చేయబడెను. అటు తరువాత మెజెల్లన్ అనునతడు భూమిచుట్టు పయనించిన తరువాతనే భూమి అంతరిక్షములో వ్రేలాడు నొక గోళము అని జనులు విశ్వసించిరి. అయితే దానికి కొన్నివేల సంవత్సరములకు ముందే, "ఆయన (దేవుడు) భూమండలము (Circle) మీద ఆసీనుడై యున్నాడు"

అని యెషయా బైబిలునందు వ్రాసెను (యెష 40:22). "మహాజలములమీద ఆయన మండలమును నిర్ణయించెనని" సొలోమోను వ్రాసెను (సామె 8:27). భూమి గుండ్రముగా నుండెనని మనుజులు తెలిసికొనక కొన్ని వేల సంవత్సరములకు ముందే ఈ సంగతులు బైబిలునందు వ్రాయబడెను.

భూమి దేనిపై ఆధారపడి యున్నది యను అంశమును గూర్చి కూడ అనేక సిద్ధాంతము లుద్భవించెను. అట్లాసు అను నతడు భూమిని తన భుజములపై మోయుచుండెనని భావించిరి. మరికొందరు అయిదు ఏనుగులు దానిని మోయుచున్నట్లు తలంచిరి. అయితే "ఆయన శూన్యముపై భూమిని వ్రేలాడచేసెను" అని బైబిలు చెప్పుచున్నది (యోబు 26:7). నేటికింకను మానవులు కనుగొనుచున్న వందల కొలది అట్టి వైజ్ఞానిక సంగతులు ఈ గ్రంథమందిమిడి యున్నవి.

దూరదర్శిని సహాయమువలన ఖగోళశాస్త్రము నేడు బహుగా అభివృద్ధి చెందినది. ఆకాశమందలి నక్షత్రములు లెక్కింప నగునని మానవులు ఒకప్పుడు తలంచితిరి. అయితే ఈ దూరదర్శినివలన నక్షత్రములు లెక్కింప తరముగాదని ఇప్పుడు ఋజువైనది. క్రీస్తుపూర్వము 1500 సం॥ల క్రితమే ఆకాశ నక్షత్రములు లెక్కింప తరముగావని మోషే వ్రాసిన సంగతిని ఇది మనకు జ్ఞప్తికి తెచ్చుచున్నది (ఆది కాండము 15:5).

బైబిలు నందలి ప్రవచముల నెరవేర్పును బట్టి అది నమ్మతగినది. ఆయా రాజ్యములను గూర్చియు - పట్టణములను గూర్చియు, జనాంగములను గూర్చియు వందలకొలది ప్రవచనములున్నవి. ఈ ప్రవచనము:లు వాటి నెరవేర్పుకు, కొన్ని వందల లేక వేల సంవత్సరములకు ముందే చెప్పబడినను, అవి అక్షరాల నెరవేరెను.

పాత నిబంధన ప్రవచనముల నెరవేర్పే యేసుక్రీస్తు - పాత

నిబంధనలోని అనేక మాదిరులు క్రీస్తును సూచించుచున్నవి. ఆయన జననము, జీవము, మరణము, పునరుత్థానములను గూర్చిన ప్రవచనము లన్నియును ఖచ్చితముగా నెరవేరినవి. నిజానికి యేసుక్రీస్తు బైబిలునకు ఆదియు అంతమునై యున్నాడు. పాత నిబంధనలోని ఆఖరి పుస్తకము క్రీస్తు పూర్వము 450 సం॥లకు ముందే వ్రాయబడినందున, క్రీస్తును గూర్చిన ఆఖరి ప్రవచనము అది నెరవేరుసరికి 400 సం॥ల పాతదై యుండె నన్నమాట! వానిలో కొన్ని 8, 9, 10 వందల సం॥లకు పైగా యున్నపుడు నెరవేరినవి. అందుచే దానిని ప్రవచించిన వ్యక్తి తన ప్రవచన నెరవేర్పును గూర్చి ఇసుమంతయును కూడ తన పలుకుబడి నుపయోగించుకొన వీలులేకున్నది. దీనినిబట్టి దేవుడు తన సేవకుల ద్వారా పలికిన సంగతులపై సమస్తాధికారమును ఆయనే కలిగి యుండె ననుట బహు నమ్మతగినది!

బైబిలు అభివృద్ధి చేయతగని గ్రంధము. మానవుని పనులెన్న డును పరిపూర్ణములుగావు. నేటి తన యంత్రములు రేపటి తరములో మార్చబడుచున్నవి. నిన్నటి తన శాస్త్రీయ గ్రంధములు నేటి పరిహాస గ్రంధము లాయెను. అయితే బైబిలునందు సరిదిద్దవలసిన సంగతు లేమియును లేవు. నేటి ఆధునిక జ్ఞానము ప్రబలక కొన్ని వందల సంవత్సరములకు ముందునుండే బైబిలు ఈ లోకమందు గలదు. అది అభివృద్ధి చేయతగనిది గనుక అది తప్పక భగవత్కృషియే అయి యుండు ననుట విశ్వాసనీయమైనది.

బైబిలు సంఘటనలు చారిత్రికముగాను, భౌగోళికముగాను యధార్థమైనవి. బైబిలు యధార్థతను గూర్చి మన మనేక సంగతు లను చెప్పుకొన వచ్చును. అది మానవునికి దేవునిచే బయలుపరచ బడిన గ్రంధము. పాపనరుడు రక్షింపబడుటెట్లో అది బోధించుచు, నీతి మార్గముల నతనికి గరపుచున్నది. గనుక ప్రియ చదువరీ! నీవు

జ్ఞానివగుటకు దానిని పఠించుము. రక్షించబడుటకు దానిని నమ్మి కోబడుము. దాని పఠనము నిజానికి లాభదాయకమైన ఆనందమును, సహాయకరమైన హెచ్చరికనై యున్నది. బైబిలుగ్రంథము యథార్థ మని, అది నమ్మతగినదని మరచిపోవద్దు సుమీ!

JOSHUA GOOTAM

---

## దేవుని మార్గములు ఖచ్చితమైనవి

**(*God's ways are Absolute*)**

—జె. సి. బెయిలీ

ఈలోక రాజ్యములనన్నిటిని వాటి మహిమను నీకిచ్చెదనని అప వాది యేసుతో అనినప్పుడు ఆయన "ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను" అని జవాబిచ్చెను. ఈ విషయ ములో దేవుడు చాల ఖచ్చితముగ మాట్లాడెను: "పైన ఆకాశమందే గాని క్రింద భూమియందేగాని భూమిక్రింద నీళ్ళయందేగాని యుండు దేనిరూపము నయినను విగ్రహమునయినను నీవు చేసికొనకూడదు; వాటికి సాగిలపడకూడదు; వాటిని పూజింపకూడదు. ఏలయనగా నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను; నన్ను ద్వేషించు వారి విషయములో మూడు నాలుగు తరములవరకు తండ్రుల దోషము కుమారులమీదికి రప్పించెదను" (నిర్గమ 26:4, 5). దేవుడు తాను పలికినది ఉద్దేశించి పలికినట్లు పాతనిబంధన పదేపదే మనకు సూచించుచున్నది. పాతనిబంధనలోని ఋజువుల సారాంశ మంతయు యిది: దేవుడు విగ్రహారాధనను ద్వేషించుచున్నాడు.

పరుల మార్గములు అసత్యమని తన మార్గమే సత్యమని యేసు చెప్పుచున్నాడు. "ఇరుకుద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు

ద్వారము వెడల్పును, ఆదారి విశాలమునై యున్నది, దానిద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకుపోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దానిని కనుగొనువారు కొందరే" (మత్తయి 7 : 13, 14). మరల ఆయన ఇట్లనుచున్నాడు: ఆయన మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బుద్ధిమంతుడు. అయితే ఆయన మాటలు వినియు వాటిచొప్పున చేయనివాడు బుద్ధిహీనుడగును (మత్తయి 7:24-27).

ఆయన మాటలను మరల విందము: "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నాద్వారా నే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" (యోహాను 14:6). "కాగా మీ పాపములలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుగురు" (యోహాను 8:24). "పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది" అని ఆయన చెప్పెను. దీనినిబట్టి ఆయన ప్రభుత్వమునకు తప్ప మరియే ఆత్మీయ ప్రభుత్వమునకు తావులేదు. మానవుల విశ్వాస ప్రమాణములకు తావులేదు. దేవుని ఖచ్చితప్రణాళికలో (Absolute Plan) డినామినేషనులకు ఏమాత్రము తావు లేదనే ముగింపు ఇందులో ఇమిడియున్నది.

మీరే రైటు, మిగిలిన వారందరు తప్పు అని మీరనుకొనుచున్నారని కొందరు అప్పుడప్పుడు నాతో అంటూ యుంటారు. అట్టివారు గ్రహించుకొనలేరు. యేసే రైటని నా విశ్వాసము. బైబిలు మాత్రమే సరియని, మిగిలినదంతయు సరికాదని నేను నమ్మును. దేవుని వాక్యముతో నేను ఏకీభవించ లేకపోయిన యెడల నాదే తప్పు.

క్రీస్తుకును ఆయన సంఘమునకున్న విషయములలో దేవుని వాక్యమునకు మానవకల్పిత సిద్ధాంతములకున్న పోరాటము మిగిలిన

సంగతు లన్నిటికంటె హెచ్చుగా కన్పడుచున్నది. ఎఫెసీ 4:4 లో శరీర మొక్కటే యని ఆ లేఖకుడు వ్రాసెను. ఎఫెసీ 1:22, 23 లో ఆ శరీరమే సంఘము అని పరిశుద్ధాత్ముడు ప్రకటించెను. సంఘము అనేక శరీరములతో సమకూడి యున్నదనియు, వేర్వేరు డినామినేష నులు అన్నియు కలసి సంఘమై యున్నదనియు మానవులు అందురు. నీవు దేవుని ఖచ్చితమైన బోధను అంగీకరింతువా? ఒక్కటే శరీర మున్నది. ఆ శరీరమే సంఘమై యున్నది.

సంఘముద్వారా మానవులు దేవుని సదాకాలము సేవింపవలె నని దేవుడు కోరుచున్నాడు (ఎఫెసీ 3:21).

మనము ఇప్పటివరకు చూచినట్టియు చూడగల్గునట్టియు విష యాల్లో దేవుని మార్గము ఎంత ఖచ్చితమైనదో ఆయన రక్షణ మార్గముకూడ అంతే ఖచ్చితమైనది. నమ్మువానిని రక్షించుటకు సువార్త దేవునిశక్తియై యున్నది (రోమా 1 : 16). ప్రకటింపబడిన సువార్తను మనము నమ్ముదుము (మార్కు 16:15). దేవుని మనము మితము చేయలేము గాని దేవుడే తన్ను తాను మితము చేసికొనిన దానిని గుర్తించెదము.

దేవుని మార్గము ఖచ్చితమైనదని జ్ఞాపక ముంచుకొనుచు ఒక హెచ్చరికద్వారా ఈ పాఠమును ముగించుకొందము: "క్రీస్తు బోధ యందు నిలిచియుండక దానిని విడిచి ముందుకుసాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆబోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు" (2 యోహాను :9).

# ప్రశాంత జీవితము

(*Peaceful Life*)

—P. ఫిలేమోను

లోకములో నున్న ప్రతి ఒక్కరూ తమ జీవితకాల మంతయు ప్రశాంతముగా గడచిపోవలెననియు, తదనంతరము నిత్య జీవములో దేవునితో కలిసి సంతోషించ వలయుననెడి కోరిక కలిగి యుందురు. ఆశతోపాటు కృషికూడ చాలా అవసరమనియు, ప్రయత్నములేకుండా ఏమియు సాధించలేమనియు బైబిలు బోధించుచున్నది. ఒక ఆటలో నైపుణ్యము సంపాదించాలంటే దానికొరకెంతో ప్రయాస పడితేనే గాని దానిని పొందలేము. ఆ ప్రకారముగానే జీవమును ప్రేమించి మంచి దినములు చూడగోరువాడు చెడ్డదానిని పలుకకుండ తన నాలుకను, కపటపుమాటలు చెప్పకుండ తన పెదవులను కాచుకొనవలెను. అతడు కీడునుండి తొలగి మేలు చేయవలెను. సమాధానమును వెదకి దానిని వెంటాడవలెను. ప్రభువు కన్నులు నీతిమంతులమీదను, ఆయన చెవులు వారి ప్రార్థనలవైపునను ఉన్నవిగాని ప్రభువు ముఖము కీడు చేయువారికి విరోధముగా ఉన్నది అని భక్తుడైన పేతురు చెప్పెను (1 పేతురు 3:10-12).

మనము అనేకసార్లు వ్యర్థమైన మాటలు పలుకుచు దేవుని ఉగ్రతకు గురి యగుచున్నాము. జీవితములో నెమ్మదిలేక యుంటు న్నాము. దానికంతటికి కారణము మన నోరే. ఎవడైనను నోటికి కళ్ళెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచుకొనుచు భక్తి గలవాడనని అనుకొనిన యెడల వాని భక్తి వ్యర్థమే అని భక్తుడైన యాకోబు చెప్పెను (యాకోబు 1:26). అవును మన మన్ని విషయము లలో జాగ్రత్తగా యుండవచ్చు. అయితే నోటిని స్వాధీనములో

ఉంచుకొనకపోతే అది అంతయు వ్యర్థము. ఆలాగుననే నాలుకకూడ చిన్న అవయవమైనను బహుగా అదిరిపడును. కొంచెము నిప్పు ఎంతో విస్తారమైన అడవిని తగులబెట్టును. నాలుక అగ్నియే, నాలుక మన అవయవములలో ఉంచబడిన పాపప్రపంచమై సర్వ శరీరమునకు మాలిన్యము కలుగజేయుచు ప్రకృతి చక్రమునకు చిచ్చు పెట్టును. అది నరకముచేత చిచ్చు పెట్టబడును (యాకోబు 3:5-6). నాలుకను లొంగచేయుట మన కసాధ్యమని తలంచవచ్చును కాని దేవునికి సమస్తము సాధ్యము (మత్తయి 19:26). నీయెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను అని దావీదు కీర్తనల గ్రంథమందు చెప్పెను (కీర్త 119:11). తననోరు కాచుకొనువాడు తన్ను కాపాడుకొనును. ఊరుకొనక మాటలాడు వాడు తనకు నాశనము తెచ్చుకొనును (సామె. 13:3), మాట్లాడుటను గూర్చి ప్రసంగి యిట్లు చెప్పుచున్నాడు : నీ దేహమును శిక్షకు లోపరచునంత పని నీ నోటివలన జరుగనియ్యకుము. అది పొరపాటు చేత జరిగెనని దూత యెదుట చెప్పకుము; నీ మాటలవలన దేవునికి కోపము పుట్టించి నీవేల నీ కష్టమును వ్యర్థపరచుకొందువు (ప్రసంగి 5:5). మనము మాట్లాడు ప్రతి మాట ఆలోచించి మాటలాడవలయును. లేనిచో అనేక సమస్యలు ఎదురగును. ఎందుకనగా. జీవమరణములు నాలుక వశము. దానియందు ప్రీతిపడువారు దాని ఫలం తిందురు (సామె 18:21). అనేక విషయములలో మనమందరము తప్పిపోవుచున్నాము. ఎవడైనను మాటయందు తప్పని యెడల అట్టివాడు లోపము లేనివాడై తన సర్వ శరీరమును స్వాధీనమందుంచుకొన శక్తిగలవాడగును (యాకోబు 3:2). చెప్పేది ఒకటి చేసేది మరొకటిగా యుండకూడదు. అటువంటివారు దేవుని చిత్తమును సంపూర్తిచేయజాలరు. నీతిమంతుడుగా తీర్చబడగోరువాడు ప్రమాణము చేయగా నష్టము కలిగినను మాట తప్పడు (కీర్త 15 : 4). కృతజ్ఞతావచనమే

మీరుచ్చరింపవలెను గాని మీరు బూతులైనను, పోకిరిమాటలైనను, సరసోక్తులైనను ఉచ్చరింపకూడదు. ఇవి మీకు తగవు అని అపొస్తలుడైన పౌలు చెప్పుచున్నాడు (ఎఫెసీ 5:4). అవునంటే అవును. కాదంటే కాదు అని మాత్రమే మనము చెప్పవలయునుగాని వ్యర్థమైన మాటలు మన నోటికి రానీయకూడదు. వాటి పేరెత్తకూడదు. ఇహపరసుఖములు పొందగోరువారు నోరు విషయములో మాత్రమే గాకుండా ఇంకను కొన్నిటిలో జాగ్రత్తగా యుండవలయునని అపొస్తలుడైన పేతురు సెలవిచ్చెను. కీడునుండి తొలగి మేలు చేయవలయును (1 పేతురు 3:11). సాధ్యమైనంత వరకు ఇతరులకు మనవలన ఏ విధమైన కీడు కలుగకుండ చూచుకోవలయును. ఎందుకనగా ఆశీర్వాదమునకు వారసులవుటకు మీరు పిలువబడితిరి గనుక కీడుకు ప్రతి కీడైనను, దూషణకు ప్రతి దూషణయైనను చేయక దీవించుడి. ప్రభువైన యేసు ఆప్రకారము చేసెను. కావున క్రీస్తు యేసునకు కలిగిన యీ మనస్సును మీరును కలిగి యుండుడి అని ఫిలిప్పీ 2:5 లో భక్తుడైన పౌలు చెప్పెను. కావున అందరితో సమాధానమును, పరిశుద్ధతయు కలిగి యుండుటకు ప్రయత్నించుడి. పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడడు (హెబ్రీ 12:14). నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడి యున్నది (1 పేతురు 1:16). మన మీరీతిగా జీవించిన యెడల ఇహమందు నూరురెట్లు దీవెనలును పరమందు నిత్యజీవమును పొందునని మీతో నిశ్చయముగా చెప్పు చున్నాను (మార్కు 10:30).

# స్వస్థపర్చు కృపావరములు

—పాల్ గూటం

క్రీస్తు యేసునందు నమ్మికగలవారు, స్వస్థపర్చు కృపావరముల విషయములో దుర్బోధకులవలన మోసగింపబడకుండు నిమిత్తము బైబిలును పరిశోధించుట అవసరము.

దయతో ఈ దిగువ లేఖన భాగములను చదివి సత్యమును గుర్తించండి.

## క్రీస్తు ప్రభువు

1. వెంటనే స్వస్థపరచెను. మత్త 8 : 3; మార్కు 1 : 30, 42, 2 : 11, 12, 10 : 52; లూకా 4 : 39, 5 : 13, 14, 25; యోహా 5 : 9.
2. అందరినీ స్వస్థపరచెను. మత్త 4 : 23, 14 : 36; లూకా 9 : 11, 6 : 19; అపొ. కా. 10 : 38.
3. పూర్ణముగా స్వస్థపరచెను. మత్త 9 : 29, 30; లూకా 13 : 12, 13

## అపొస్తలుల వలన

1. వెంటనే స్వస్థతపొందిరి. అపొ. కా. 3 : 2, 7, 9: 35, 14 : 10.
2. అందరూ స్వస్థత పొందిరి. అపొ. కా. 5 : 16, 28 : 8. 9.
3. పూర్ణముగా స్వస్థత పొందిరి. అపొ. కా. 3 : 16, 14 : 10.

## నేటి స్వస్థతాకూటములు, ప్రార్థనలు.

1. వెంటనే కాదు: వాయిదా ప్రార్థనలు విదేశీదొరలయొద్దకు తరలింపు.
2. అందరికీ కాదు: కొందరికైనను లేదు. వచ్చిన రోగులను రోగముతోనే పంపుదురు.
3. పూర్ణస్వస్థత లేదు: కొద్దిగాను లేదు. గాని కొంచెము స్వస్థతయైనది అను అబద్ధ సాక్ష్యము మాత్రమున్నది.

యేసుక్రీస్తు దేవుని కుమారుడని మనము నమ్మి జీవము పొందునట్లు క్రీస్తుచేసిన అనేక సూచక క్రియలలో కొన్నిమాత్రమే క్రొత్తనిబంధన గ్రంథమందు వ్రాయబడెను. (యోహా 20 : 30, 31). దేవుని వాక్యము స్థిరపరచు నిమిత్తము అపొస్తలులవలన సూచక క్రియలు చేయబడెను. ఈబోధ పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడి (యోదా 3), మనము

(తరువాయి ఆఖరి పేజీలో)

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

**తెలుగు — సత్యవాణి**

ఆదివారము నుండి శనివారము వరకు మధ్యాహ్నం **2-30** గం॥లకు

**హిందీ — సత్యసుసమాచార్**

మంగళవారము, గురువారము, శుక్రవారము — 9-00 to 9-15 P.M.

శనివారము — 9-45 to 10-00 P.M.

**ఇంగ్లీషు — The Voice of Truth**

ఆదివారము — 10-15 to 10-30 P.M.

మంగళవారము — 9-30 to 9-45 P.M.

**తమిళం — The Way of Truth**

మంగళవారము — 5-30 to 5-45 P.M.

గురువారము — 6-45 to 7-00 P.M.

శుక్రవారము — 6-45 to 7-00 P.M.

**మలయాళం — The Voice of Truth**

మంగళవారం — 3-45 to 4-00 P.M.

శుక్రవారము — 3-45 to 4-00 P.M.

---

**ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికీ విన్పించండి.**

తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి :

**S A T Y A V A N I**

P.O. Box 80, KAKINADA - 533 001

---

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ-1

నిత్యము దానిని జ్ఞాపకము చేసికొనులాగున గ్రంథముగా వ్రాయ బడెను. (2 పేతురు 1 : 12-31). మరియు దేవుని వాక్యము క్రొత్తనిబంధన గ్రంథముగా రూపొందని కాలమందు సంఘమున కీయబడిన కృపావరములన్నియు (1 కొరింథి 12 : 8-10), పూర్ణమైనది వచ్చినపుడు అనగా సర్వ సత్యము గ్రంథముగా వ్రాయబడిన పిమ్మట (యాకో 1 : 25) నిలిచిపోయెను (1 కొరింథీ 13 : 8-13).

అందుచే నేటి స్వస్థతాకూటములలో గంతులు అరుపులు తప్ప ఒక్క స్వస్థతయైనను అద్భుతమైనను జరుగుటలేదు. మరియు స్వస్థతావరము గలవారమని చెప్పుకొనుచు అస్వస్థత కలిగినపుడు వైద్యశాలలను ఆశ్రయించుచున్నారు. అంతేకాదు తమ అబద్ధ సాక్ష్యాలతో జనములను మోసగించుచున్నారు. మీరు యింకను సువార్త సత్యము ఉన్నవి ఉన్నట్లు తెలిసికొనుటకు క్రీస్తు సంఘములను సంప్రదించండి.

---

**BOOK-POST**

To

...............................................

...............................................

...............................................

*From*
SATYAWAKKU
P.O. Box 80
KAKINADA - 533 001